తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

### భక్తులకు సంతృప్తికర సేవలపై

# నిరంతరం అధ్యయనం

**-తిరుమలలో వరుసగా తనిఖీలతో నూతన ఈఓ శ్యామలరావు బిజీబిజీ**





తిరుమల, జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామిని వీక్షించి సంతోషంగా తిరిగి వెళ్ళేలా చూస్తానని చెప్పిన మాటప్రకారం ,భక్తులకు సంతృప్తికర సేవలపై నూతన టిటిడి ఈఓ జె.శ్యామలరావు నిరంతరం అధ్యయనం చేస్తున్నారు. టిటిడి ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన వరుసగా మూడురోజులు తిరుమలలోనే ఉంటూ భక్తుల కనీస సౌకర్యాలు కల్పన, ఇబ్బందులు, అదనపు క్యూలైన్లపై తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం కూడా నూతన ఈఓ శ్యామలరావు, జఈఓలు వీరబ్రహ్మం, గౌతమి,సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,ఇంజనీరింగ్ అధికారులు. ఐటి విభాగం తదితరులతో కలసి సుడిగాలి పర్యటన తనిఖీలు చేశారు. యాత్రికుల రద్దీ అధికంగా ఉండి ,దాదాపు ఐదు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న క్యూలైన్లను పర్యవేక్షించడానికి వెంటనే ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎఇఒ)ను ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. తిరుమలలో స్థానికులకు కేటాయించిన ఇళ్ళు, దుకాణాలు, హోటళ్ళు ,జనతాక్యాంటీన్లు పరిశీలించి యాత్రికులకు వడ్డించే తినుబండారాల ఖరీదు, బయట బోర్డులపై ప్రదర్శించిన ధరలను పరిశీలించారు. శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్లు, నారాయణగిరి అతిదిభవనాలు ,శేషాద్రినగర్ కాటేజీలను ఆయన పరిశీలించారు.

## సమన్వయంతో సహకరిస్తాం

**-నూతన టిటిడి ఈఓను కలసిన జిల్లా కలెక్టర్ ,ఎస్పీ**





తిరుమల. జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:
సమన్వయంతో మీతో కలసి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధమని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీన్‌కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. నూతన టిటిడి ఈఓ జె.శ్యామలరావును మంగళవారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల,తిరుపతిలో యాత్రికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా చర్చించారు.



# సారథ్యం వహించేది ఎవరు!

**సమన్వయం చేసుకుని జిల్లాను అభివృద్ధి పథంలోకి నడిపేదెవరు!**

**ప్రజల నుండి ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు - కన్పిస్తున్న మంత్రి లేని లోటు**

చిత్తూరు, ప్రభాతవార్త:
రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లా నుండి ఎవరికి ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాకు సారథ్యం వహిస్తూ జిల్లాను అగ్రపథంలో తీసుకెళ్ళడం ఎవరు! అనే ప్రశ్నలు ప్రస్తుతం ప్రజల నుండి ఉత్పన్నం అవుతున్నాయి. సిఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల ఏర్పాటు చేసిన మంత్రి వర్గంలో జిల్లా నుండి ఎవరికి మంత్రిగా అవకాశం కల్పించకపోవడంతో మంత్రి లేని లోటు జిల్లాలో స్పష్టంగా కన్పిస్తుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నుండి ఇది వరకు జిల్లా మంత్రితో పాటు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వుండేవారు. జిల్లా మంత్రి జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధికారులను సమన్వయం చేసుకుని తరచు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధి పథంలో తీసుకెళ్ళడానికి కృషి చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జిల్లా సమీక్షా సమావేశాలకు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి హాజరై జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్ళడానికి ప్రయత్నించేవారు. జిల్లా నుండి సిఎంగా నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి జిల్లాకు ప్రత్యేకంగా ఒక మంత్రి అనేది కచ్చితంగా అవసరం. రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎవరికి అవకాశం కల్పించకపోవడంతో జిల్లాకు సారథ్యం వహించి జిల్లాను ముందుకు తీసుకెళ్ళడం ఎవరనే ప్రశ్నలు ప్రస్తుతం అందరి నుండి వ్యక్తం అవుతున్నాయి. జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి వేదికలుగా జడ్పీ సర్వసభ్య సమావేశంతో పాటు జిల్లా సమీక్షా సమావేశం జరుగుతుంది. ఈ రెండు సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి జరుగుతుంటాయి. జడ్పీ సర్వసభ్య సమావేశంకు జడ్పీ ఛైర్మన్ ఛైర్మన్‌గా వ్యవహరించినా జిల్లా మంత్రి మంత్రి హోదాలో హాజరై జడ్పీ సమావేశం మొత్తం తన గుప్పిట్లో తీసుకుంటారు. జిల్లాను విభజించినప్పటికీ జిల్లా పరిషత్‌ను ఇప్పటికి విభజించకపోవడంతో జడ్పీ ఛైర్మన్ ఇప్పటికీ ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు.
ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిమితమైనప్పటికీ జడ్పీ ఛైర్మన్ మాత్రం 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు జడ్పీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు. మరో రెండేళ్ళ పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలకు జడ్పీ ఛైర్మన్ ఒక్కరే వుంటారు. అలాగే విభజిత చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 31 మండలాలు వున్నప్పటికీ జిల్లా పరిషత్‌లో మాత్రం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 65 మండలాలు వున్నాయి. అంటే 65 మంది జడ్పీటిసీలు, ఎంపిపిలు జడ్పీ సమావేశానికి హాజరు కావాల్సి వుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సిఎం నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలను ఎవరైనా మంత్రి వర్గంలో స్థానం కల్పించి వుంటే త్వరలో జరగనున్న జడ్పీ సమావేశంలో మంత్రిగా నియమితులైన ఎమ్మెల్యే మంత్రి హోదాలో జడ్పీ సర్వసభ్య సమావేశంను తన గుప్పిట్లో తీసుకునే అవకాశం వుండేది. అలాగే జిల్లా స్థాయిలో సమీక్ష జరిగే సమావేశం జిల్లా సమీక్షా సమావేశం ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సిఎం చంద్రబాబునాయుడు మంత్రి వర్గం ఏర్పాటు చేసినప్పటికీ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులను నియమించకపోవడంతో ఇప్పట్లో జిల్లా సమీక్షా సమావేశం జరిగే అవకాశం కన్పించడం లేదు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఎమ్మెల్యేలు, అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాకు సారథ్యం వహిస్తూ జిల్లాను ఉన్నత స్థానంలోకి తీసుకెళ్ళడం ఎవరు! అనే ప్రశ్నలకు సమాధానం తేలాల్సి వుంది. ఇప్పట్లో కొత్తగా జిల్లా నుండి మంత్రిగా ఎవరిని నియమించే అవకాశం లేకపోవడంతో జిల్లాలోని ఏదేని ఒక ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా పదవి ఇచ్చి వారి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తుందా! లేక జిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రిని నియమించి ఆయన ఆధ్వర్యంలో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్ళడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా! అనేదానిపై స్పష్టత రావాల్సి వుంది.

### కలెక్టర్ ఉత్తర్వులు

# బుట్టదాఖిలు!

**మామిడికి కేజీపై రూ.30 గిట్టుబాటు ఇవ్వని ప్రాసెసింగ్ యూనిట్లు**

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:
జిల్లాలో కలెక్టర్ సగిలి షన్మోహన్ మామిడి రైతుకు తోతాపురి రకం మామిడిపై కేజీ రూ.30కు తగ్గకుండా చెల్లింపులు చేయాలని జారీ చేసిన ఉత్తర్వులు బుట్టదాఖలు అయ్యాయి. జిల్లాలో ఏ ఒక్క మామిడి ప్రాసెసింగ్ యూనిట్, ర్యాంపు యాజమానులు ఏ ఒక్కరు మామిడి రైతుకు కలెక్టర్ నిర్ధేశించిన మేరకు ధర చెల్లించడం లేదు. ఈ మామిడి సీజన్ ప్రారంభంలో తోతాపురి రకం మామిడి ధర కేజీ రూ.30 వరకు పలుకడం, జిల్లాలో తోతాపురి రకం మామిడి తక్కువగా వుండటంతో భవిష్యత్తులో మరింత ధర వస్తుందని మామిడి రైతు భావించాడు. ఈ మేరకు తోతాపురి రకం మామిడి కోతకు వచ్చినా మరికొంత ధర పెరుగుతుందని ఆశించి కోత కోయకుండా అలాగే వుంచాడు. అయితే అనూహ్యంగా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి తోతాపురి రకం మామిడి దిగుబడి కావడంతో ఇక్కడ తోతాపురి ధరను ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యాజమానులు తగ్గించి వేశారు. ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఒక కేజీ మామిడిపై రైతుకు రూ.23 చెల్లిస్తే, ర్యాంపు యాజమానులు రైతుకు ఒక కేజీ తోతాపురి రకం మామిడిపై రూ.22 చెల్లించేవారు. ఈ క్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నిర్ణయించి ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులు ఒక కేజీ తోతాపురి రకం మామిడిపై రూ.30 తక్కువ లేకుండా చెల్లించాలని, అలా చెల్లించని ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులు, ర్యాంపు యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే జిల్లా వ్యాప్తంగా సోమవారం సైతం మామిడి రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులు ఏ మాత్రం ధర పెంచకుండా ఇది వరకు చెల్లిస్తున్న విధంగానే కేజీపై రూ.23 చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. మరో పదిహేను రోజుల్లో తోతాపురి సీజన్ ముగింపుకు రానుండటంతో మామిడి రైతుకు ఇప్పట్లో గిట్టుబాటు ధర ఇవ్వకుంటే భారీ నష్టాలను మూట కట్టుకొనే అవకాశం వుండటంతో అధికారులు స్పందించి మామిడి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## స్మార్ట్ సిటి నిర్మాణాలపై దృష్టి సారించాలి

**కలెక్టర్ ప్రవీణ్ కుమార్**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 18, ప్రభాతవార్త
తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో నిర్మాణంలో వున్న ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తిరుపతి మున్సిపాల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డు డైరెక్టర్ 34వ సమావేశం తిరుపతి స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ ప్రాజెక్టుల వివరాలు తెలియజేయగా, స్మార్ట్ సిటీ బోర్డు డైరెక్టర్లు అయిన డిల్లీ నఉండి సెంట్రల్ అండర్ సెక్రటరి రవిచంద్ర, తిరుపతి జిల్లా పోలీస్ ఎస్పి హర్షవర్ధన్ రాజు, తుడా వైస్ చైర్మన్ వెంకట నారాయణలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొనగా ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా ఉన్న రామచంద్రారెడ్డి, రమాశ్రీ పాల్గొనగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### చిన్నశేష, హంస వాహనాలపై దర్శనమిచ్చిన

# ప్రసన్న వేంకటేశ్వరుడు





**అప్పలాయగుంటలో ఉదయం చిన్నశేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై స్వామివారు విహారం**

వడమాలపేట, జూన్ 18 ప్రభాతవార్త:
అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారు మంగళవారం ఉదయం చిన్నశేష, రాత్రి హంస వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు వాహన సేవలు ఘనంగా జరిగాయి. వేకువ జామున సుప్రభాతసేవతోస్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వంగా సుందరంగా అలంకృతుడై అలంకరించిన చిన్నశేష వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. స్థానికులు ఇళ్ళ ముందు అందంగా రంగవల్లులు తీర్చిదిద్ది స్వాగతం పలికారు. వాహనానికి ముందు భక్తులు కోలాటాలు, భజనలు చేస్తూ స్వామివారి సేవలో తరించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీల్లు, పసుపు, చందనంలో అభిషేకం జరిగింది.సాయంత్రం 5.30 గంటల నుంచి గంటసేపు ఊంజల్‌సేవలో శ్రీవారు సిద్వీలాసంగా ఊయాల ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు అలంకరించిన హంస వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.





**తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు సుందరరాజస్వామి అలంకారంలో విహరించి భక్తులను కటాక్షించిన అమ్మవారు - ప్రభాతవార్త-తిరుపతి**



**ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్**

## సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:
ప్రజల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో వచ్చే సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారితనంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు 45 సమస్యలపై కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 35 సమస్యలు రాగా నేషనల్ హైవే, వ్యవసాయశాఖ, డిఆర్‌డిఎ, చిత్తూరు మున్సిపాల్టీ, విభిన్న ప్రతిభావంతులు, పోలీసు శాఖ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, హౌసింగ్, విద్యుత్‌లకు సంబంధించి ఒకొక్క సమస్య వచ్చాయి.

## ఒత్తిళ్లు.. వీధినపడిన వాలంటీర్లు

కోట, జూన్ 18 ప్రభాతవార్త
అయిదేళ్లుగా కష్టపడ్డాం.. తీరా ఎన్నికల రాగానే రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేశారు. తప్పించుకుని తిరిగినా పట్టుబట్టి రాజీనామా చేయించారు. కొత్త ప్రభుత్వం వస్తే జీతం రూ 10 వేలు వస్తుందని,ఉద్యోగ భద్రత కలుగుతుందని ఆశ పడ్డాం. వైకాపా నాయకులు బలవంతగా రాజీనామా చేయిండంతో రోడ్డన పడ్డామని కోట మడలంలో పలువురు వాలటీంర్లు కన్నీటి పర్వతమవుతున్నారు. జిల్లాలో 2019 ఆగస్టు 15 న ప్రారంభించిన గ్రామ ,వార్డు, వాలంటీరు వ్యవస్థ ద్వారా కోట మండలంలో 250 పైకి పైగా చేరారు. నెలకు రూ 5 వేలు గౌరవ వేతనం ఇచ్చేలా గత వైకాపా ప్రభుత్వం తీసుకుంది. డీగ్రీ, ఫీజీ, ఇంజినీరింగ్, చేసి నిరుద్యోగ సమస్యతో తప్పని పరిస్దితుల్లో వాలంటీర్లుగా విధుల్లో చేరారు. విద్యార్హతలు బట్టి ప్రభుత్వ అధికారులు నిర్వహించిన ముఖాముఖిలో అర్హత సాధించిన తమను రాజీనామా చేయమనడానికి మీరెవరిని కొందరు వాలంటీర్లు క్షేత్రస్దాయిలో ఎదురు తిరిగినా.. నాయకులు ఒత్తిడి చేసి రాజీనామా చేయించారు. ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో కొందరు నేతలు వారితో రాజీనామా చేయించడంతో ప్రస్తుతం వారి కుటంబాల వీధిన పడే పరిస్దితి నెలకొంది. వైకాపా జెండాలు మోసేందుకు అత్యుత్సాహం చూపిన వాలంటీర్లతో పాటు నేతల ఒత్తిడి తోడుకావడంతో రాజీనామా లేఖలను అధికారులకు అందజేసి నేతల వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాలతో చూసి తొందరపాటు చర్యకు వాలంటీర్లు బాధపడే పరిస్దితి నెలకొంది. నాలుగేళ్లపాటు ఇంటింటికి పరిచయాలు పెంచుకున్న వాలంటీర్లు తమకు దూరమైతే ఓట్లు రాబట్టడం కష్టమవుతుంనే ఉద్దేశంతో కొందరు నేతలు స్వార్ధపూర్తింగా బలవంతంగా తమతో రాజీనామా చేయించారని తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాలంటీర్ల కన్నీటి పర్యంతమవుతున్నారు.

# కాణిపాకం ఆలయ చైర్మన్ గిరి ఎవరిని వరించేనో!



కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త:
సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి చైర్‌పర్సన్ పదవికోసం పలువురు టీడీపీ నాయకులు అపుడే పైరవీలు సాగిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఈదఫా ఎలాగైనా ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలని పలువురు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పాలక మండలి ఛైర్మన్ పదవిని ఆలయ ఉభయదారులకే కేటాయించే ఆనవాయితీ అనాదిగా వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన పాలకమండలి వైకాపా రాష్ట్రంలో ఓడిపోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, సభ్యులు అందరూ రాజీనామా చేశారు. అలాగే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం పార్టీ కోసం కష్టపడిని నాయకులకు నామినేటెడ్ పోస్టుల పందారం ద్వారా తగిన న్యాయం చేస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో కాణిపాకం ఆలయ పాలకమండలి ఛైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని పలువురు ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2018 ఆగస్టు 3న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు కొద్ది రోజులు ముందుగా సురేంద్రబాబు ఛైర్మన్‌గా రెండేళ్ళ కాలపరిమితితో ట్రస్ట్ బోర్డు ఏర్పాటైనా ఏడాది కూడా పూర్తి కాకుండానే టీడీపీ అధికారం కోల్పోవడంతో ట్రస్ట్ బోర్డు పదవీకాలం అర్ధాంతరంగా ముగిసింది. తిరిగి ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆలయ ఉభయదారులు పలువురు పాలకమండలి ఛైర్మన్ పదవికోసం పోటీ పడుతున్నారు. ఈమేరకు బొమ్మసముద్రంకు చెందిన ఆలయ మాజీ ఛైర్మన్ సురేంద్రబాబు అలియాస్ మణినాయుడు, కాణిపాకం పంచాయతీ మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, కాకర్లవారిపల్లెకు చెందిన పూర్ణచం ద్రరావు, ఐరాల మండల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఎం.లతలు ప్రస్తుతం ప్రధానంగా పోటీల్లో వున్నట్లు తెలుస్తోంది. ఈదఫా తనకు ఒక్క అవకాశం కలి ్పంచి ఛైర్మన్ పదవిని కేటాయించాలని స్థానిక మాజీ సర్పంచ్ మండల టీడీపీ నాయకులు మధుసూధన్‌రావు పార్టీ నాయకులను కోరినట్లు తెలిసింది. అలాగే ఇప్పటిచే తాను పార్టీకోసం కష్టపడినా తనకు ఇంతవరకు పార్టీ పరంగా ఎటువంటి పదవి ఇవ్వనందున ఛైర్మన్ పదవి ఇవ్వాలని పూర్ణచంద్రరావు పార్టీ అధిష్టానంను కోరినట్లు తెలుస్తోంది. అలాగే తిరువణంపల్లెకు చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఎం.లత మహిళా కోటాకింద ఈదఫా తనకు ఛైర్మన్ పదవిని ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ప్రధాన పోటీదారులు ఎలాగైనా ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలని తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదిలా వుండగా ఆలయ ఛైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని ఆలయ ఉభయదారులైన ఎస్సీలు డిమాండు చేస్తున్నారు.

## నేను బడికిపోతా కార్యక్రమంను విజయవంతం చేయండి

తవణంపల్లె, జూన్ 18 ప్రభాతవార్త:



6 నుండి 13 ఏళ్ళ లోపు వున్న బడిఈడు పిల్లలందరికి బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ అమలు చేస్తున్న 'నేను బడికిపోతా' కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుండి జూలై 12 వరకు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు నేను బడికి పోతా కార్యక్రమంను అమలు చేసున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు హేమలత, దేవరాజులురెడ్డి, సీడీపీఓ నిర్మల, హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సీఆర్పీలు పాల్గొన్నారు.

**ఐరాలలో...**

ఐరాల, జూన్ 18 ప్రభాతవార్త:

బడి ఈడు పిల్లలందరికి వంద శాతం బడిలో చేర్పించేందుకు ప్రభుత్వ అమలు చేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంఈఓలు రుష్యేంద్రబాబు, దామోదర్‌నాయుడులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6 నుండి 13 ఏళ్ళ లోపు నిల్లలందరూ బడిలో వుండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇందు కోసం ఈనెల 13 నుండి జూలై 12 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రీనివాసులు, ఈఓ పీఆర్డీ కుసుమ కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, వార్డెన్ ఏకాంబరం, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నా రు.

## తిమ్మానాయనపల్లెలో ఉచిత వైదశిబిరం

సదుం, జూన్ 18 ప్రభాతవార్త



మండల పరిధిలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం తిరుపతి రమాదేవి మల్టి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. సర్పంచి మురళీరెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి పరిపాలన కొరకు ప్రార్థనలు

సదుం, జూన్ 18 ప్రభాతవార్త



దేశంలోను, రాష్ట్రంలోను ఏర్పడిన నూతన ప్రభుత్వాలు మంచి పరిపాలనకు ఎటువంటి ఆటంకాలు రాకూడదని పులిచెర్ల మండలం కల్లూరులోని బీసీ కాలనీలో ఉన్న క్రైస్ట్ చర్చిలో పాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా ఈపాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరినట్లు ఆయన చెప్పారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పాస్టర్లుశాంసన్, జార్జ్, జాన్సన్, తిమోతి, డేనియల్, ప్రతాప్, సంపత్, మహర్షిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 89 పెద్దూరులో ఇళ్ల పట్టాలు రద్దు చేయాలి

రామకుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



మండలంలోని 89 పెద్దూరులో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని గ్రామస్తులు తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. 2019కు ముందు అంగన్‌వాడీ కేంద్రం, పశువుల ఆస్పత్రికి స్థలాన్ని సిద్ధం చేయగా 2023లో అక్కడ పన్నెండు మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా స్థలం విషయంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈస్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రం, పశువుల ఆస్పత్రికి కేటాయించాలని కోరారు.

## చిరువ్యాపారులకు అండగా నిలుస్తాం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పంరూరల్, జూన్ 18 ప్రభాతవార్త

కుప్పంలో గల చిరు వ్యాపారులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్ అధ్వర్యంలో చిరువ్యాపారులు అధిక సంఖ్యలో కలసి ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల మాట్లాడుతూ చిరు వ్యాపారులకు అర్హత ఉంటే తగు ప్రభుత్వ పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామన్నారు. పట్టణంలో చిరువ్యాపారులు తమ వ్యాపారాలు సక్రమంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమాల్లో మతీన్, లాలుతదితరులు పాల్గొన్నారు.

## పరిశీలించి సత్వరం పరిష్కారానికి చర్యలు

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:



ప్రజల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు సమస్యలు, మున్సిపల్ కార్యాలయంకు సంబంధించి రెండు సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగజాతర ప్రారంభం

– గంగమ్మను దర్శించుకున్న జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు, ఎమ్మెల్యే

పాలసముద్రం, జూన్ 18 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం పాలసముద్రం గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభం అయ్యింది. మంగళవారం తెల్లవారు జాము గంగమ్మను ప్రతిష్టించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గంగమ్మకు పొంగళ్ళు పెట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసునాయుడు వీరిని రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు నివాసానికి తీసుకెళ్ళారు. అక్కడ వీరు విలేకరులతో మాట్లాడుతూ జిడినెల్లూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో అభివృద్ధిలో దూసుకెళ్ళనుందన్నారు.

## 'నేను బడికి పోతా'పై సమీక్షా సమావేశం

బంగారుపాళ్యం, జూన్ 18 ప్రభాతవార్త:



స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్షా సమావేశం చేపట్టారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశంను ఎంఇఓ నాగేశ్వరరావు చేపట్టారు. తహసిల్దారు సుభద్రమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం నేను బడికి పోతా కార్యక్రమంను చేపట్టిందన్నారు. జులై 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పాఠశాలల పరిధిలో బడి మానివేసిన పిల్లలు, బడి ఈడు పిల్లలను పాఠశాలలను చేర్పేవిధంగా ఉపాధ్యాయులు గ్రామస్తులతో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శివశంకర్, ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో ఎన్‌సీఆర్‌టీ సీఈఓ

కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త:



నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌టీ) సీఈఓ అండ్ డైరక్టర్ డాక్టర్ తాడేపల్లె మంగళవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్రప్లమెంటరీ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త

ఇటీవల జరిగిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల 100శాతం ఉత్తీర్ణ సాధించిందని ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు. పరీక్షలకు వివిధ గ్రూపుల నుంచి 27మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. వారందరినీ అధ్యాపకులు బాలాజీ, సుబ్రమణ్యం, యశోదమ్మ తదితరులు అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిత్తూరు సమగ్రాభివృద్ధికి చర్యలు

– కలెక్టర్‌ను కలిసి విన్నవించిన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:




చిత్తూరు నగర సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను మంగళవారం కలిసి విన్నవించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ చిత్తూరు మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అడవిపల్లి రిజర్వాయర్ పనులను సత్వరం పూర్తి చేయూనికి చర్యలు తీసుకోవాలని, చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేసి విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయాలని, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ట్రామా కేర్ యూనిట్, డయాలసిస్ సెంటర్, క్యాన్సర్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే లెనిన్ నగర్‌లోని డంప్ యార్డును దూర ప్రాంతానికి మార్చాలని, మూసి వేసిన ఫ్యాక్టరీలను తెరిపించాలని, చిన్న వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని, చిత్తూరులో కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు పి.చైతన్య, సురేంద్రనాథ్‌వున్నారు.

## రోడ్డును ముంచేసిన వర్షపు నీరు

–ఇబ్బందుల్లో నేతాజీనగర్ వాసులు

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త



అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని నేతాజీ నగర్‌లోనూ అదే పరిస్థితి నెలకొనింది. అరకొర రోడ్డు వేసి కాలువలు అమర్చక పోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి కాలనీ చివర వరకు ఇదే పరిస్థితి నెలకొనింది. మహిళలు, వృద్ధులు, పిల్లలు ఈ మార్గంలో నడవాలంటేనే భయ పడుతున్నారు. వర్షపు నీటిలోకి విష సర్పాలు రావడంతో మరింతగా భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ఇళ్ళ నుంచి బయటకు రాలేని పరిస్థితిలో వారున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు పక్కనే వున్న చెరువులోకి ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని నేతాజీ నగర్ వాసులు కోరుతున్నారు.

## విద్యావుపయోగకర వస్తువులు పంపిణీ

చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త



బిసివై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ జన్మదినాన్ని పురష్కరించుకొని విద్యార్థులకు విద్యావుపయోగకర వస్తులను పంపిణీ చేసారు. మండలంలోని పంచాయతీ కేంద్రం చింతమాకులపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హరిబాబు యాదవ్ యువసేన కుమ్మర గిరిబాబు రాత పుస్తకాలతోపాటు విద్యా సామాగ్రిని ఉచితంగా అందించారు. సత్యయాదవ్, భరత్‌కుమార్, హైదరాబాదు శివ, అన్నవరం కృష్ణదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లా నియామకంపై పుంగనూరులో సంబరాలు

పుంగనూరు, జూన్ 18 ప్రభాతవార్త :



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబా బునాయుడు నియమించడం పట్ల పుంగనూరులో సంబరాలు నిర్వహించుకున్నారు. సీనియర్ ఎన్టీఆర్ రాష్ట్ర అభిమానుల సంఘ ఉపాధ్యక్షుడు, సీనియర్ తెలుగుదేశం నాయకుడు దుద్యాల అప్పిరెడ్డి అధ్వర్యంలో మంగళవారం ఉదయం పట్టణంలో పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చంద్రబాబు, పల్లా కటౌట్‌లకు పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది వెంకటముని మాట్లాడుతూ ప్రపంచమేధావిగా గుర్తింపు పొందిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రంలో సుస్థిరపాలన నెలకొంటుందన్నారు. కేక్ కట్‌చేసి సంబరా లు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అభివృద్ధితో పాటు సంక్షేమం.. ఇదే మా లక్ష్యం

– మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం.

సూళ్లూరుపేట, జూన్ 18 ప్రభాతవార్త



సూళ్లూరుపేట నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకురావాలన్న లక్ష్యంతోనే తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని, ఇందుకు తగ్గట్టుగా నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పనిచేస్తారని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఆయన కొండేపాటి గంగాప్రసాద్ నివాస గృహంలో విలేఖరులతో మాట్లాడారు. 2014–19లో సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల ప్రజల దాహార్తి తీర్చేందుకు సుమారు రూ.162 కోట్లు, రూ.142 కోట్ల వ్యయంతో మంచినీటి ప్రాజెక్టులను తీర్చిదిద్దాలని సంకల్పించి నిధులు మంజూరు చేశారన్నారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసి మూలన పడేసిందన్నారు. దీంతో ఈ రెండు పట్టణాల్లో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రప్రథమ సమస్యగా మంచినీటి సౌకర్యం కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని తెలిపారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు వచ్చి సేదతీర్చుకునే విధంగా పార్టీ కార్యాలయాలు లేవని, ఈ రెండు పట్టణాల్లో అనువైన స్థలాలను ఎంపిక చేసిన నూతన పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు శ్రీకారంచుడతామని నెలవల చెప్పారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో దివంగత నేత ఎన్‌టీఆర్ విగ్రహాల ప్రతిష్టకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్నీ తానై నడిపించిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, బొమ్మన్ శ్రీధర్, బొమ్మన్ పళణి, మేడా సాయి, ఇవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా నియామకంపై హర్షం

కోట, జూన్ 18 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస యాదవ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నియమించడం పట్ల తిరుపతి జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ పల్లా శ్రీనివాస యాదవ్‌కు తెలుగుదేశం పార్టీతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. బీసీ వర్గానికి చెందిన శ్రీనివాస యాదవ్ నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గాజువాక స్థానం నుంచి రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. కార్మిక నాయకుడిగా టీడీపీ అనుబంధ విభాగం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఏర్పాటులో శ్రీనివాస యాదవ్ కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆయనఅందించినసేవలనుగుర్తించిపార్టీ అధిష్టానం రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించిందన్నారు.

## షాదీమంజిల్ కమిటీని రద్దు చేయాలి

కోట, జూన్ 18 ప్రభాతవార్త

కోటలో ఉన్న షాదీమంజిల్ కమిటీని తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని కోట పట్టణ టీడీపీ అధ్యక్షుడు షంషుద్దిన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా షాదీమంజిల్ కమిటీలో లేని వారు పెత్తనం వహించి భ్రష్టుపట్టించారని ఆరోపించారు. షాదీమంజిల్‌లో జరిగిన కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో అధికారులు విచారణ జరిపించాలని, రికార్డులు స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

## దోమల నివారణపై ప్రత్యేక దృష్టి

కోట, జూన్ 17 ప్రభాతవార్త

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చిట్టేడు ఉప ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్.నాగరాజు చెప్పారు. ఈ నెలాఖరు వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, పర్యటిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నారని తెలిపారు, మలేరియా, డెంగీ తదితర జ్వరాల బారిన పడకుండా తీసుకోవవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతోందన్నారు. ఇందుకు ప్రజలందరి సహకారం అవసరమన్నారు. శాఖ పరంగా ఇప్పటికే ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నామన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి తమ ఇళ్ల పరిసరాల్లో మురికి నీళ్లు నిల్వఉంచుకొండా చూసుకోవాలన్నారు. మన ఆరోగ్యం మన చేతోల్లోనే ఉందన్నారు.

## నేడు పట్టణాలు తాగునీటి సరఫరా నిలిపివేత

కమిషనర్ అబ్దుల్ నజీర్

వెంకటగిరి, జూన్ 18, ప్రభాతవార్త

పైపులైను లీకేజీ కారణంగా 19వ తేది బుధవారం పట్టణంలో తాగు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఒకటో వార్డు నుండి 25వ వార్డు వరకు తాగునీటి సరఫరా ఉండదని వివరించారు. పైపులైన్లు మరమ్మతులు అనంతరం తాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

## తవ్విన గుంటలను పూడ్చండి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జూన్ 18, ప్రభాతవార్త



గ్యాస్ పైప్‌లైన్ కొరకు పట్టణంలో ఎక్కడపడితే అక్కడ గుంటలు తీసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పైప్ లైన్ పనులు చేసుకోవాలని పైప్ లైన్ ఏజెన్సీ నిర్వాహకులకు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచించారు. గూడూరు పట్టణంలో అశోక్ నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నివాసంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలు ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలు సమస్యలు ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ గ్యాస్ పైప్ లైన్ ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ పైప్ లైన్ కొరకు పట్టణంలో రోడ్లన్నీ ధ్వంసం చేశారని దీనివల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేసుకోవాలని అలాగే ఇప్పటి వరకు తవ్విన గుంటలపై రీప్యాచ్ వర్క్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే అధికారులకు గానీ మాకు గానీ తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జూన్ 18, ప్రభాతవార్త



సౌత్ కోస్ట్ రైల్వే డివిజన్ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ శంకర్రావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని రైల్వే జంక్షన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ శంకర్రావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్ర రాష్ట్రం చాలా రంగాల్లో వెనుకబడి ఉందని కావున రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగుల నియామకం దేశవ్యాప్తంగా ఒకే విధంగా జరుగుతున్నాయని ఆ విధానం కాకుండా రాష్ట్రాల వారీగా క్లాస్ ఫోర్ ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కొత్త రైల్వే మార్గాలను నిర్మించాలని ప్రయాణికులకు కల్పిస్తున్న అవసరాలను, సౌకర్యాలను మరింత మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. విజయవాడ కేంద్రంగా ప్రధాన నగరాలకు వందే భారత రైళ్లను వెయ్యాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రుని ఆలయంలో అన్నదానం

గూడూరు, జూన్ 18, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో కొలువై ఉన్న శ్రీ కల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వహకులు తుమ్మూరు ముని మోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పధాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మీనుగుల రమాదేవి జ్ఞాపకార్థం అరవింద్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మీనుగుల వెంకట్, కుటుంబ సభ్యులు తదితరులు వ్యవహరించారు.

## ఎమ్మెల్యే పాశం సునీల్‌ను కలిసిన జనసేన నాయకులు

గూడూరు, జూన్ 18, ప్రభాతవవార్త



గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను జనసేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరు రూరల్, చిట్టమూరు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు రౌతు శివ కుమార్, దామవరపు బాలసుబ్రమణ్యం, సోమిశెట్టి మనోజ్, పాలిచెర్ల భాస్కర్, క్రాంతి కుమార్‌లతో పాటుగా, పట్టణ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఇమ్రాన్ ఖాన్, కుందర్తి నాగార్జున, వంశి, దార కుమార్‌లు గూడూరు జనసేన పార్టీ కార్యాలయం నుండి పాదయాత్రగా వెళ్లి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాసంకు వెళ్లి ఆయనను కలిసి అభినందనలు తెలిపి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఎంఎల్ఏ సునీల్ కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టించి పని చేశారని వారందరినీ గుర్తు పెట్టుకోవడంతో పాటుగా అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. అంతకుముందుగా జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌ను పలు మండలాల జనసేన నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిటిసి మోహన్, జనసేన పార్టీ నాయకులు మహేష్, స్వరూప్, అర్బర్, కార్తిక్, మహేష్, భాస్కర్, ఓంకార్, వసంత్ కుమార్, సాయి, శేఖర్, ముత్తు, నందాని భాష, శశి, తిరుపాలు, మస్తాన్, రాము, వేణు, ఉప్పుసాయి, తిరుపాల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు చేయూత ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేవీకే అధిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి, జూన్ 18, ప్రభాతవార్త



రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి నందు పిఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా రైతుల కొరకు ప్రధాన మంత్రి చేతుల మీదుగా 17వ విడతగా ప్రతి రైతు ఖాతాల్లో 2000 వితరణ కార్యక్రమాన్ని వీక్షింప చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.బి. గోవింద రాజులు రైతులు వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను విశ్లేషించాలని వివరించారు. ఏడిఏ డా. నాగార్జున మాట్లాడుతూ నీటి వసతి లేని పొలాల్లో వరికి ప్రత్యామ్నాయంగా వేరుశెనగ, సజ్జ, మినుము వంటి పేర్ల పై దృష్టి చూపాలని లేదా పచ్చి రొట్ట పైర్లైన జిలుగ, జనుము, పిల్లి పెసర వంటి పైర్లు వేసుకోవాలని రైతలను కోరారు. కేవీకే నందు చేపడుతున్న కార్యక్రమాలపై వివిధ విభాగాల శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ, గిలకపాడు గ్రామ సర్పంచ్, ఇతర బిజెపి సభ్యులు, పశు సంవర్ధక శాఖ నుండి డా. కిషోర్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డా. బి. విజయశ్రీ, డాపి నాగార్జున రెడ్డి, డా. డి. తిరుపాల్, డా. ఐ. రాజీవన్, వెంకటగిరి మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బడిఈడుపిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

రామకుప్పం, జూన్ 18 ప్రభాతవార్త

మండలంలో ఉన్న బడిఈడు పిల్లల్ని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ ఈశ్వరయ్య సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, షూలు తదితరాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఏపిఆర్‌డి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలుగుభాష పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్సీ డా॥కంచర్లకు వినతి

శాంతిపురం, జూన్ 18 ప్రభాతవార్త



తెలుగుభాషను పరిరక్షించేందుకు తగు కృషి చేయాలని తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌ను తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథ ం నాయుడు వినతిపత్రం అందించారు. విద్యాహక్కుచట్టం మరియు నూతన జాతీయ విద్యావిధానం 2020 మేరకు పాఠశాల విద్య మాతృభాషలో కొనసాగేలా కృషి చేయాలని కోరారు. గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో ఉండేలా కృషి చేయాలని కోరారు. శ్రీనివాసులురెడ్డి, మురళి, వినోద్, పరంధామనాయుడు పాల్గొన్నారు.

## బృందమ్మను సత్కరించిన పానగల్ యువకులు

శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పానగల్‌లో జరుగుతున్న జాతర సందర్భంగా మంగళవారం తెలుగుదేశం నాయకురాలు బొజ్జల బృందమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా వ్యవహరించారు. గెలుపే లక్ష్యంగా పని చేసారు. విజయం సాధించారు. తమకు విజయలక్ష్మీని అందించిన గ్రామ దేవత పానగల్ గంగమ్మకు బృందమ్మ మొక్కులు తీర్చుకున్నారు. ఆమెను నూతనంగా ఏర్పడ్డ యువ కమిటి జయకృష్ణ,ముత్తు,మునికుమార్,లీలామోహన్,మోహన్‌గౌడ్,భాస్కర్ గౌడ్ తదితరులు సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.

## ఆర్యవైశ్యులకు ప్రభుత్వం వరాలు

శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త



రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు ప్రభుత్వం వరాలు ప్రకటించిందని దక్షిణభారత దేశ రైల్వే సలహామండలి సభ్యుడు, రాష్ట్ర ఆర్యవైశ్యమహాసభ కార్యవర్గ సభ్యుడు ఐతామురళి అన్నారు. ముఖ్యంగా ఉపము ఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంగళవారం మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వరాలను అందించారన్నారు. ముఖ్యంగా అమ్మవారి ఆత్మార్పారణ దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తామనటం అంతేకాక ఆర్యవైశ్య వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తామనటం ఉమ్మడి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇస్తున్న గుర్తింపుకు నిదర్శనం అని మురళి అన్నారు.గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎందరో ఆర్యవైశ్యుల పిల్లలు ఆర్థికంగా చితికి పోయి కనీసం చదువుకోవటానికి కూడా ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారిని గుర్తించి ఆదుకోవాలని మురళి కోరారు.

## గ్రామాల్లో మంచినీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలి

.తొట్టంబేడు, జూన్ 18 ప్రభాతవార్త



గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ సూచించారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈఈ మమత, మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ వర్షాలు పడేంతవరకు గ్రామాల్లో ఎలాంటి మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు. పైపులైన్లు మరమ్మత్తులు వెంటనే పూర్తి చేస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈఈ మమత మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ప్రతి 15రోజులకు ఒకసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులను క్లీన్ చేయాలని సూచించారు. నీటి నాణ్యతను తెలుసుకోవడానికి టెస్టింగ్ కిట్‌లను వినియోగించాలని అసిస్టెంట్లు తమ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే ఇంజనీరింగ్ అధికారులు ద్వారా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

## కాశీవిశ్వనాధునికి తలనీలాలు సమర్పణ

శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త



గాండ్ల తెలికుల బిసి సాధికారత సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాశీగా పిలవబడే వారణాసిలో గంగానది ఒడ్డున ఉన్న కాశీవిశ్వనాధునికి తలనీలాలు సమర్పించాడు. తెలుగుదేశంపార్టీ ఎంఎల్‌ఏగా బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచినందుకు మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. మంగళవారం రోజున గంగమ్మకు సారె సమర్పించి కాశీ విశ్వనాధస్వామివారికి అర్చనలు పూజలు నిర్వహించి తలనీలాలు సమర్పణతో మొక్కులు తీర్చుకున్నామని తెలిపారు.

# తగ్గని భక్త జనం: ఎండలతో సతమతం

### స్థంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి,జూన్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం మంగళవారం భక్తజనంతో కిట కిట లాడింది. సాధారణంగా గతంలో శుక్రవారం నుంచి సోమవారం వరకు మాత్రమే భక్తుల తాకిడి ఉండేది. ప్రస్తుతం ఒక్క గురువారం మినహా మిగిలిన అన్ని రోజుల్లోనూ భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. మంగళవారం ఆలయంలోని 16 కాళ్ళ మండపంలో వెలసిన వీరాంజనేయ స్వామికి ప్రత్యేకాలంకారాలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారు. మూక తీర్థం ఎదురుగా ఉన్న చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.మధ్యాహ్నం రాహుకాల సమయంలో రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తులు ఎండలను సైతం లెక్క చేయక హాజరయ్యారు.ఏర్పాట్లను ఆలయాధికారులు పర్యవేక్షించినా ప్రణాళికలు లేకపోవటంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు.

**రికార్డు స్థాయిలో పూజలు: అభిషేకాలు:**

దేవస్థానం మంగళవారం సాయంత్రం అందించిన సమాచారం మేరకు సుమారు 25వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. రాహుకేతుదోష నివారణ పూజలు 4561, అభిషేకాలు 69 సాయంత్రం నిర్వహించే మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 37 ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు 2700లు కొనుగోలుచేసి భక్తులు ప్రవేశించారు.ముఖ్యంగా రాహుకాల సమయంలో భక్తుల తాకిటి అధికంగా ఉంటుంది. అయితే ఆ సమయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడుతుంది. పూజల అనంతరం భక్తులు ప్రవేశించే దారిలో అడ్డదిడ్డంగా అర్థం కాని క్యూలైన్లను ఏర్పాటు చేసారు. దాంతో విఐపిలుఎలా వెళ్ళాలి? సామాన్య భక్తులు ఎటు వెళ్ళాలో తెలియక తికమక పడుతున్నారు.సూచిక బోర్డుల్లేక గందరగోళానికి గురౌతున్నారు.

## కైలాసనాధకోన ట్రస్టుభోర్డు ఛైర్మన్ రేసులో బొమ్మినేని శ్రీనివాసయాదవ్..?



నారాయణవనం, జూన్ 18 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసకోనలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మికకేంద్రంగా బాసిల్లుతున్న కామాక్షాంబిగా సమేత కైలాసనాధకోన ట్రస్టు భోర్డు ఛైర్మన్ రేసులో అదే పంచాయతీ గోవిందప్పనాయుడుకండ్రిగ పంచాయతీకి చెందిన బొమ్మనేని శ్రీనివాసయాదవ్‌లో రేసులో వున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. వచ్చే నెల 9వ తేది వరకు ప్రస్తుతం వైకాపా ప్రభుత్వంలో ఏర్పాటైనా పాలకమండలి కాల గడువు వున్నది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ప్రస్తుతం ట్రస్టు భోర్డు ఛైర్మన్‌గా వున్న చిత్తూరు కండ్రిగ గ్రామానికి చెందిన ఇ సుబ్రమణ్యంయాదవ్ పదవీకి రాజీనామా చేశారు. ఛైర్మన్ రాజీనామా చేసిన సభ్యులు మాత్రం కొనసాగుతున్నారు. అయితే యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకే మళ్లీ కోన ఛైర్మన్ పదవీని కట్టబెట్టాలని నాయకులు డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. ఆ మేరకు టిడిపి పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న బొమ్మినేని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆ పదవీ వరించాలని కోరుకుంటున్నారు. ఏది ఏమైనా పార్టీ కోసం, ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడి పని చేసిన శ్రీనివాస్ యాదవ్‌కే పదవీని కట్టబెట్టాలని అందరు కోరుకుంటున్నారు. త్వరలో తుది నిర్ణయం వెలువడనుంది..

## ఘనంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ పుట్టినరోజు వేడుకలు



.శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త

పురపాలక సంఘ మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముత్యాల పార్ధసారధి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి తల్లి బొజ్జలబృందమ్మను దుశ్శాలువతో సత్కరించి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీవీనాయుడు నివాసంలో కేక్‌కట్‌చేసి పుట్టినరోజు సంబరాలు చేసుకున్నారు. పలువురు తెలుగుదేశంపార్టీ శ్రేణులు,అభిమానులు సారధికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ - ఒకరు మృతి

కేవీబీ పురం, జూన్ 18 ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ లోకనాథం కథనం మేరకు... సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మునస్వామి(35) కేవీబీ పురం మండలంలోని ఆదిత్య స్పిన్నింగ్ మిల్లు కర్మాగారంలో సెక్యూరిటీగా విధులు నిర్వహించేవాడని తెలిపారు. సోమవారం మునస్వామి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరి వెళుతున్న సమయంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కేవీబీ పురం గ్రామానికి చెందిన అలీ(25) ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో మునస్వామి ప్రమాదస్థలంలోనే మృతి చెందగా తీవ్ర గాయాలైన ఆలీని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## మంత్రి సవితకి శ్రీకాళహస్తి దేవస్థానం ప్రసాదం

కేవీబీ పురం, జూన్ 18 ప్రభాతవార్త:

బీసీ వెల్ఫేర్ ఎస్.సవిత మంత్రి సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం ప్రసాదంను రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, ఒల్లూరు సర్పంచ్ సురేష్ చౌదరి, తిమ్మ సముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, తిరుపతి పార్లమెంట్ పాలేగార్ సంఘం అధ్యక్షులు వెంకటకృష్ణయ్యలు కలసి అందజేశారు. మంత్రికి శాలువలు కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బొజ్జల సుధీర్‌రెడ్డిని సన్మానించిన బలిజసేన నాయకులు

కేవీబీ పురం, జూన్ 18 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని సత్యవేడు బలిజ సేన సేవా సంఘం అధ్యక్షుడు, కేవీబీ పురం మండల ఉపాధ్యక్షుడు పొన్నపాల మోహన్ ఆధ్వర్యంలో బలిజసేన నాయకులు ఆయనను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగించగల శక్తి సామర్థ్యాలు బొజ్జల సుధీర్‌రెడ్డికి పుష్కలంగా ఉందని మోహన్ కొనియాడారు. అనంతరం శాలువలతో సుధీర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి మునిరాజ, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు పావని, వీర మహిళ ఝూన్సీ, తులసి, కుమార్, విజయ్‌లు పాల్గొన్నారు.

## గోడకూలి వ్యక్తి మృతి

చంద్రగిరి, జూన్ 18 ప్రభాతవార్త:



ఇంటి గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందిన విచాకర సంఘటన నరశింగాపురం, ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల మేరకు.. ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలో నివశిస్తున్న సి.బాబు (58) సోమవారం రాత్రి తన తల్లితో కలసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 11 గంటల సమయంలో కురిసిన వర్షానికి ఇంటి గోడ కూలడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో ఆసుపత్రికి తరలించగా వేకువజామున 3 గంటలకు తుది శ్వాస విడిచారు. మృతుడి భార్య జ్యోతి గతంలోనే మరణించారు. కుమార్తె మీనాకు వివాహం జరిపించి పంపించారు. తల్లి ఇంద్రమ్మతో కలసి వుంటున్న బాబు అకాల మరణంతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఇళ్ళత్తూరులో ఉపాధి కూలీలకు అవగాహన

విజయపురం, జూన్ 18 ప్రభాతవార్త:



మండలంలోని ఇళ్ళత్తూరులో వీఐడీఎస్ వారు ఉపాధి కూలీలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మండల కౌన్సిలర్ జాన్‌సుభాకర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు పొదుపు కార్డు కలిగి ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి సురిక్ష భీమా యోజన పథకం కింద సంవత్సరానికి రూ.20 చెల్లించి రూ.2 లక్షలు ప్రమాద భీమా పొందవచ్చన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా, అటల్ పెన్షన్ యోజన, సుఖన్య సంవృద్ధి యోజన వంటి పథకాల గురించి సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు.పలువురు వీఐడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్వీ యూనివర్శిటీ విసి శ్రీకాంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

### యూనివర్శిటీని కుల రాజకీయాల నుంచి విముక్తి కల్పించాలి సిపిఐ న్యూ డెమొక్రసీ డిమాండ్



తిరుపతి విద్య, జూన్ 18, ప్రభాతవార్త

ప్రభుత్వం మారడంతో ఎస్వీ యూనివర్శిటీ విసి శ్రీకాంత్ రెడ్డి చాంబర్‌లో ఇటీవల తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బైటాయించి మరీ అయన్ని పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేసిన విషయం విధితమే. వైసిపి నేతల అండతో వీసీ ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన్ని గతేడాది డిసెంబర్‌లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫార్సుతోనే వీసీ పదవికి నియమితులయ్యారు. అప్పటి నుంచి 100 మంది దాకా తాత్కాలిక ఉద్యోగులను మంత్రి సిఫార్సు ద్వారా నియమించారనేది ఆరోపణ. 2019 ఎన్నికలలో వైసిపి అధికారంలోకి రాగానే దాని మద్దతుదారులు ఆనాటి ఎస్వీయూ వీసి రాజేంద్రప్రసాద్ ఛాంబర్‌లోకి చొరబడి ఆయన బంగ్లాలోకి కూడా దూరి పదవి నుండి తప్పుకోవాలని గొడవకు దిగారు. దాంతో ఆయన తీవ్ర మనోవేదనతో పదవి నుండి తప్పుకుని వెళ్ళిపోవాల్సి వచ్చింది. యూనివర్శిటీలో రాజకీయ జోక్యం వల్ల కుల రాజకీయం హెచ్చు మీరి ప్రశాంతత దెబ్బతింటుంది. ఇలాంటి వాతావరణం ప్రక్షాళన కోసం కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ తతిరునతి నగర కార్యదర్శిగా ప్రొఫెసర్లకు విజ్ఞప్తి చేసారు.

## పెనుమూరు బస్సులను పునరుద్ధరించండి

తిరుపతినుండి పెనుమూరుకు ఆర్టీసి బస్సులను పునరుద్ధరించాలని టిడిపి అధికారప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం ఆర్టీసి ఆర్‌ఎం చెంగల్‌రెడ్డిని కలసి పెనుమూరు బస్సులను తిరిగి నడపాలని విజ్ఞప్తి చేశారు.

*ప్రభాతవార్త-తిరుపతి*



## శివయ్య సేవలో తెలంగాణా ఉపముఖ్యమంత్రి

శ్రీకాళహస్తి,జూన్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. మంగళవారం తెలంగాణ ఉపముఖ్యమంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయమర్యాదలతో వేదపండితులతో ప్రోటోకాల్ ఎఇఓ సతీష్‌మాలిక్ స్వాగతం ఏర్పాట్లుచేసారు.స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.కాగా మృత్యుంజయ ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించిన స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు. ఏర్పాట్లును పిఆర్ఓ నాగభూషణం నాయక్,రవి,శ్రీనాధ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, సిఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## పానగల్ గంగమ్మకు దేవస్థానం నుంచి సారె

### అధికారులచే సమర్పణ

శ్రీకాళహస్తి,జూన్ 18 ప్రభాతవార్త



ఏ గ్రామ దేవత ఆలయంలో అయినా ఉత్సవాలు జరిగే సమయంలో శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందించే సంప్రదాయాన్ని గత పాలకమండలి ప్రవేశ పెట్టింది.ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు సారెను అందించే వారు. అయితే ఈ సారి స్థానికంగా నాయకత్వం మారింది. అయితే స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అందుబాటులో లేకపోవటంతో అధికారులకు అవకాశం లభించింది. దేవస్థానం నుంచి సారెను అంగరంగ వైభవంగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా పొన్నాలమ్మ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ వి నాగేశ్వరరావు సారధ్యంలో సారెను దేవస్థానం నుంచి తెచ్చారు. కొత్తగా నియమించిన కమిటి అధ్యక్షుడు గుణశేఖర్, ఇతర కమిటి ప్రముఖులు సత్రవాడ ప్రవీణ్,గౌరవ సలహాదారు ప్రకాష్‌నాయుడు,భాస్కర్‌గౌడ్, వైస్‌ఛైర్మెన్ జయకృష్ణయాదవ్,కోశాదికారి మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలమురుగన్, కార్యదర్శి మునిశేఖర్ గౌడ్, మునిసుబ్రమణ్యం,రూపేష్ కుమార్‌లు హాజరు కాగా అమ్మవారికి సారెను అందించారు.ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిఎసి మల్లికార్జున్ ప్రసాద్,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,ఎస్ఓ నాగభూషణం యాదవ్,వేదపండితుడు అర్ధగిరి స్వామి హాజరు కాగా సారెను అందించారు.

# తిరుపతి డివిజన్

## ప్రముఖ పారిశ్రామికవేత్త గంగప్రసాద్‌తో ఎమ్మెల్యే ఆదిమూలం భేటీ

నారాయణవనం, జూన్ 18 ప్రభాతవార్త :



ప్రముఖ పారిశ్రామికవేత్త, సూళ్లూరుపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు గంగప్రసాద్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రస్తవించడంతో పాటు అధికారుల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అన్నింటిపై సానుకూలంగా గంగప్రసాద్ స్పందించినట్టు తెలిసింది.

## శింగరికోన లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్వాతి నక్షత్ర పూజలు

నారాయణవనం, జూన్ 18 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామపరిధిలోని శింగిరికోనలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ంలో మంగళవారం సా ్వతి నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లను పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీరు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు మూడు పూట్ల ఉచిత అన్నదాన కార్యక్రమం జరిగింది.

## బాలల భవిష్యత్తే....రాష్ట్ర భవిష్యత్

### -పిల్లలకు నాణ్యమైన విద్యను అందించుటకు కృషి- ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, జూన్ 18 ప్రభాతవార్త:



బాలల భవిష్యత్తుపైనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉంటుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం తిరుపతిరూరల్ పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పస్తకాల బ్యాగును ఎమ్మెల్యే అందజేసారు. ముందుగా పెరుమాళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. తరగతి నాలుగు గోడల మధ్యనే దేశ భవిష్యత్ అధారపడి ఉంటుందని, పిల్లలు విద్యావంతులైతేనే దేశ స్థితిగతులు మారతాయని ఎమ్మెల్యే నాని అన్నారు. పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతిలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహారీ గోడ నిర్మాణం చేట్టాలని, ఉపాధ్యాయులకు తగిన ఫర్నిచర్ సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పదిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు, భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించి, సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఇవో శేఖర్, డిప్యూటీఇవో బాలాజీ, ఎంఇఓ, ఎంపిడిఓ రవికుమార్, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, కత్తి సుధాకర్, నాగూరు శ్రీనివాసులు, విప్పర్ల లోకేష్‌నాయుడు, ఉసిరిపాటి శ్రీనివాసులు, మనోహార్ చౌదరి, రఘురామిరెడ్డి, కిశోర్‌రెడ్డి భానుకుమార్‌రెడ్డి, కాయం వెంకటేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హథీరాంజీ బావాజీ 595 జయంతి ఉత్సవం

తిరుపతిరూరల్, జూన్ 18 ప్రభాతవార్త:



స్వామి హాథీరాంజీ బావాజీ 595 జయంతి ఉత్సవాన్ని మంగళవారం విద్యుత్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. తిరుపతిరూరల్ వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో శివా నాయక్ నేతృత్వంలో స్వామి హాథీరాంజీ బాబా నూతన ఆలయం నిర్మితమైతున్న విషయం తెల్సిందే. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన బంజరాల ఆరాధ్య దైవానికి ప్రపంచంలోనే మొట్ట మొదటి విగ్రహ, ఆలయ నిర్మాణ భూమిపూజ మంగళవారం ఉదయం 8గంటలకు నిర్వహించారు. ఉ. 10:30గంటలకు భోగ్ భండార్, మధ్యాహ్నం 2గంటలకు అన్నప్రసాద, తీర్థములు, మధ్యా హ్నం 3గంటలకు బంజారా సాంస్కృతిక సాయంత్రం 4గంటలకు బాబా స్వామి విగ్రహ ఊరేగింపు చేసారు.

**: ఆలయ నిర్మాణానికి టిటిడి సహకారం** భానుప్రకాష్‌రెడ్డి

ప్రపంచంలోనే మొట్టమెదటిగా తిరుపతిలో నిర్మితమైతున్న శ్రీహథీరాంజీ బావాజీ ఆలయ నిర్మాణానికి టిటిడి సహాకారం అందించాలని టిటిడి పాలకమండలి మాజీ సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. బావాజీ ఆలయ నిర్మాణ భూమిలో పాల్గొనడం తన అదృష్టంగా భావించారు. హథీరాంజీ బావాజికి సంబంధించిన ఖరీదైన ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేసారు. ఇప్పటికే కోట్ల రుపాయాలు విలువచేసే మఠం భూములు అన్యాక్రాంతమైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే బంజారాల సంప్రదాయాన్ని యధావిధిగా కొనసాగించాలని సూచించారు.

## విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు

### ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూన్ 18, ప్రభాతవార్త



దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఆధారపడి ఉందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళ వారం పాకాల మండలంలోని హైస్కూల్ పాఠశాలలో నిర్వహించిన పాఠ్యాంశాల పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ పాఠశాలలు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని వల్లెడించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని ప్రణాళిబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వాణిశ్రీ, ఎంపిడిఓ నాగేంద్రబాబు, డివైఈవో బాలాజీ, ఎంఈఓలు బాబ్జీ, లింగయ్య, పాటవాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నేను బడికి పోతా విజయవంతం చేయండి

నింద్ర,జూన్ 18 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యంపిడిఓ భవాని తెలిపారు. యంపిడిఓ భవానీ మాట్లాడుతూ ఈనెల 13వతేది నుంచి జూలై 12వతేది వరకు జరిగే నేను బడికి పోతా అనే కార్యక్రమంలో 6 వయస్సు నుంచి 14 వయస్సు కలిగిన పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని, దీని కోసం మండల,గ్రామస్థాయిల్లో ఏర్పడిన కమిటీ సభ్యులు డోర్ టూ డోర్ సర్వే చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వసుమతిదేవి, శ్రీదేవిరాజు, డిప్యూటి తహాశీల్దారు మాధవిలత, అంగన్‌వాడి సూపర్‌వైజర్ శ్యామలదేవి, సిఆర్‌సి, హెడ్‌మాస్టర్ ,సిఆర్‌పిలు,పంచాయితీ కార్యదర్శి,వెల్‌పేర్,ఎడ్యూకేషన్ అసిస్టెంట్,అంగన్‌వాడి టీచర్లు,తదితరులు పాల్గొన్నారు

## 21 నుంచి అంకమ్మ తిరుణాళ్ళ

పుత్తూరురూరల్, జూన్ 18 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని వేపగుంట గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ల ఈ నెల 21 తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఓ ప్రకటనలో తెలిపారు. 21న శుక్రవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, సాయంత్రం 3 గంటల నుంచి పురవీధుల్లో గెరిగె ఊరేగింపు, రాత్రి అలుగు ఉత్సవం ఉంటుందన్నారు. 22న శనివారం ఆలయ ఆవరణంలో పోతురాజు ముగ్గు కార్యక్రమం, 23న ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం ఆలయ ఆవరణలో పొంగళ్ళు, రాత్రి భక్తులు పసుపు వస్త్రాలు ధరించి వేపాకు చేత పట్టుకుని అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం, అనంతరం రాత్రి 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమంతో తిరుణాళ్లు ముగుస్తుందని గ్రామస్థులు తెలిపారు.

## త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు ఘనంగా వీడ్కోలు

రేణిగుంట, జూన్ 18 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ దర్శకుడు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు రేణిగుంట విమానాశ్రయంలో మంగళ వారం ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయా ణమైన ఆయనకు రేణిగుంట విమానాశ్రయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి అంజూర్ చక్రధర్, ఫయాజ్ తదితరులు ఆయనను కలసి వీడ్కోలు పలికారు.

# ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ -కుప్పంలో అన్నక్యాంటీన్ ప్రారంభానికి చర్యలు చేపట్టాలి !!**

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కుప్పంలో పర్యటించారు. ఈసందర్భంగా కుప్పం పాత కడ కార్యాలయం వద్దగల అన్న క్యాంటీన్ భవనం, ఆర్అండ్‌బి అతిథిగృహాలను జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, అధికారులతో కలసి పరిశీలించారు. ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని అలాగే నూతన ఫర్నీచర్ ఏర్పాటుచేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. అతిథిగృహం, ప్రహరీగోడలకు పెయింటింగ్ చేయించాలని ఆదేశించారు. అలాగే అతిథిగృహం చుట్టూ పరిసరాలు శుభ్రం చేయడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించా లన్నారు. ఎదురుగా ఉన్న రోడ్డులో డివైడర్లకు పెయింటింగ్ చేయి ంచాలన్నారు. కుప్పం పట్టణంలోని అన్న క్యాంటీన్ భవనం పున:ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. క్యాంటీన్‌ను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుముందు వర్షాకాలం రానున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేయా లన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ అధికారులు విధుల్లో అలక్ష్యం ప్రదర్శించరాదన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. అస oపూర్తి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీఒ శ్రీనివాసులు, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ స్టాలిజోన్, డిఎస్పీ బండారు శ్రీనాథ్, మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు, తహశీల్దార్ హరికుమార్, రెస్కో ఎండి ప్రభాకర్, సిఐలు రమణ, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్


ఎల్‌విఎం3-ఎం3 రాకెట్లో ఉపయోగించిన క్రయో స్టేజ్ మంగళవారం భూ వాతావరణంలో ప్రవేశించింది. భూమికి 460 కిమిలోమీటర్ల దూరంలో ఈ దశను చేర్చినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్ష వ్యర్థాలను నిర్మూలించడానికి ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.
-ప్రభాతవార్త, తడ

## ఏనుగుల దాడుల నియంత్రణకు చర్యలు : సిసిఎఫ్



రామకుప్పం, జూన్ 18 ప్రభాతవార్త : రామకుప్పం మండలంలో పంటలు, ప్రజలపై ఏనుగుల దాడులను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అనంతపురం జోన్ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిఎంకె తాండాలో ఇటీవల ఏనుగు దాడిలో మృతి చెందిన కన్న నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకు ంటామన్నారు. గత ఐదేళ్లుగా అటవీ ప్రాంతంలో ఏనుగుల దాడుల నివారణకు చేపట్టిన కందకాలు పూడిపోవడంతో పాటు సోలార్ కంచె పాడైపోయిందన్నారు. తద్వారా ఏనుగులు దాడులు జరుపుతున్నాయన్నారు. రైతు కన్న నాయక్ మృతిపై సిఎం చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. తక్షణం ఏనుగుల దాడుల నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కందకాల్లో పూడికతీత, సోలార్ కంచె పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి తగు ప్రణాళికలు పంపడం జరుగుతుందన్నారు. ఏనుగుల జాడను కనుగొనే ట్రాకర్ల సంఖ్య పెంచాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణనాయక్, గంట్లప్పగౌడు, సిసిఎఫ్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి, ఎడిఎఫ్ఒ వేణుగోపాల్, కుప్పం రేంజర్ శివశంకర్, డిఆర్వో పుల్లయ్య, బాబు ప్రసాద్ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్ అధితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 18 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గతంలో నిర్వహణలో ఉండి మూతబడిన అన్న క్యాంటీన్లను మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అధితి సింగ్ పరిశీలించారు. తిరుపతి నగరంలో ఎంఆర్ పల్లి పంచాయితీ ఆఫీసు ముందర, అదే విధంగా ఈఎస్ఐ హాస్పిటల్ ముందర, న్యూ బాలాజీ కాలనీలోను అదే విధంగా స్విమ్స్ సర్కిల్ వద్ద గతంలో ఏర్పాటు చేసి, అటు తరువాత ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించిన అన్నా క్యాంటీన్లను కమిషనర్ పరిశీలిస్తూ త్వరలో నూతన ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించడం జరుగుతుందనే విషయాన్ని అధికారులకు తెలియజేస్తూ వాటి యొక్క స్థితిగతులను కమిషనర్ పరిశీలించడం జరిగింది. మూడు క్యాంటీన్లు ఖాళీగా వున్నాయని, స్విమ్స్ సర్కిల్ వద్దనున్న ప్రైవేట్ క్యాంటీన్‌ను త్వరలోనే ఖాళీ చేయించి అన్న క్యాంటీన్ల నిర్వహణకు సిద్ధం చేయించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా బాలాజీ కాలనీలోని గార్బేజ్ సెంటర్‌ను, ఎంఆర్‌పల్లి సర్కిల్ నుండి పంచాయితీ ఆఫీస్ వరకు డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించి ఎప్పటికప్పుడు కాలువలో చెత్తను తొలగించాలని, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. తిరుపతి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి రోజు చెత్తను తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి తమ సిబ్బందికి అందజేయాలని కొంత మంది ప్రజలకు కమిషనర్ అధితి సింగ్ తెలియజేయడం జరిగింది. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ తతిరుమాలిక మోహన్, ఇంజనీర్ చంద్రశేఖర్, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డిఈమహేష్, సానిటరీ సూపర్వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

## పేరంటాళ్ళ వేషంలో మిట్టగంగమ్మకు మొక్కులు

**కన్నుల పండువగా అమ్మవారి విశ్వరూప దర్శనం**



చంద్రగిరి, జూన్ 18 ప్రభాతవార్త:పేరంటాళ్ళ వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మ్రొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు మంగళవారం ముగిశాయి. ఇందులో భాగంగా 9వ రోజున ఆలయ ఛైర్మన్ నివాసం నుండి అమ్మవారికి సారెను సమర్పించి, మొదటి పూజను జరిపించారు. రాత్రి అమ్మవారి విశ్వరూప దర్శనం కన్నుల పండువగా జరిగింది. ఈనాటి కార్యక్రమాలకు సక్కుర్ మహాలక్ష్మి వెంకటరెడ్డి, సక్కుర్ నిరంజన్ రెడ్డి, కుప్పిరెడ్డి మునిలక్ష్మి జయచంద్రారెడ్డి (జెసిఆర్), రెడ్డివారి పల్లి సర్పంచ్ చిన్నకాళప్ప గారి రేవతి ప్రకాష్ రెడ్డి, ఒంటి దివ్య బాబిరెడ్డి, పాదిరి రెడ్డిప్రకాష్ మృదుల, హేమశ్రీ, కనుమూరి చెంగయ్య నాయుడు, కనుమూరి అనిత, కనుమూరి గౌతమ్, గుర్రమ్మ, గోవిందయ్య ఉభయదారులు వ్యవరించారు. ఎస్.సదాశివ రెడ్డి, మీనమ్మ (మీనమ్మ హోటల్) వారిచే అన్నదానం జరిపించారు. విశ్వరూప విగ్రహ తయారీదారులుగా లింగాల విజయభాస్కర్ రెడ్డి అండ్ బ్రదర్స్, డాక్టర్ పార్లపలి మునిరెడ్డి, సుభాషిణి వ్యవహరించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## చినుకు పడితే తప్పని తిప్పలు



విజయపురం, జూన్ 18 ప్రభాతవార్త: చినుకు పడితే తిప్పలు తప్పడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు పనులు వేగంగా జరగడంతో మండలంలోని కళియంబాకం, సామిరెడ్డి కండ్రిగ, సామిరెడ్డి వడ్డిండ్లకు వెళ్లాలంటే రోడ్డుకు కింది భాగంలో వంతెనలా ఏర్పాటు చేశారు. తేలికపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండడంతో దాటుకోలేక పోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. నడక ద్వారా దాటుకోవాలన్నా బురదమయంగా మారుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ద్విచక్రవాహనం అదుపు తప్పితే అధోగతి పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు కిరువైపులా వర్షపునీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై న్యాయవాదుల సంబరాలు

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త : వైకాపా పాలనలో అమలులో తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2022ను రద్దు చేస్తూ సిఎం చంద్రబాబునాయుడు సంతకం చేయడం పట్ల కుప్పంలో బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పట్టణంలోని డా॥ అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు, ప్రజల భూముల పాలిట ఈ చట్టం నల్లచట్టంగా మారిందన్నారు. ఈ చట్టంతో పేదలు తమ భూముల సమస్యలు పరిష్కరించుకోవాలంటే కిందిస్థాయి కోర్టులు కాకుండా హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చేదన్నారు. తద్వారా రైతులు, ప్రజలు తీవ్ర వ్యయప్రయాసలకు లోనయ్యేవారన్నారు. ఈచట్టాన్ని రద్దు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రప్ప, ఉదయ్‌కుమార్, న్యాయవాదులు శ్రీకాంత్, మధుసూధన్, పుష్పలత, అమర్‌నాథ్, అనిల్‌కుమార్, సుధాకర్, వాసు, పుష్పలత, శ్రీకాంత్ సురేష్‌లు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లీ చల్లంగా చూడమ్మా!



తిరుపతి, జూన్ 18ప్రభాతవార్త: తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జాతర ముగిసిన నాల్గవ మంగళవారం ప్రధాన జాతరను తలపింపజేసింది. గంగమ్మజాతర రోజులాగే నాల్గవ మంగళవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. మంగళవారం పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, కస్సా పద్మనాభం, జయసింహారెడ్డి, ఈశ్వర్, సాయిప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, సుబ్రమణ్యం, రాజశేఖర్, గంగయ్య తదితరులు శరీరానికి గంధం రాసుకుని తలకు రిబ్బన్లు కట్టుకుని వివిధ రకాల వేషధారణలతో సారెను తీసుకువచ్చారు. మంగళవాయిద్యాల నడుమ, కళాకారులు నృత్యాలతో అమ్మవారి ఆలయం చేరుకున్నారు. ఇక్కడ అమ్మవారికి సారే సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. రాయలసీమలోని ప్రజలందరికీ గంగమ్మ ఆశీస్సులు కలగాలని, సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలందరికీ మంచిజరగాలని గుండాల గోపీనాధరెడ్డి వేడుకున్నారు. అంతకుముందు నగర మేయర్ డాక్టర్ శిరీషతో కలసిగంగమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## ఉద్యోగులకు బదిలీల జ్వరం

కోట, జూన్ 18 ప్రభాతవార్త : రాష్ట్రంలో అధికార మార్పిడి తర్వాత అధికారులు, ఉద్యోగులకు బదిలీల జ్వరం పట్టుకుంది. వారం పది రోజులగా ఇదే చర్చ నడుస్తోంది. జిల్లాలోనే ఉంచుతారా.. బదిలీ చేస్తారా అన్న ఫోబియాతో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం ముగిసి ఐదు రోజులు గడుస్తున్నా ఏ శాఖలోనూ అధికారులు ,ఉద్యోగులు విధి నిర్వహణపై దృష్టి సారించడం లేదు. ఎవరు.. ఉంటారు.. ఎవరు బదిలీ పై వెళ్తారన్న దానిపైనే విస్తృత చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయంలో వైకాపా నాయకులతో చట్టా పట్టాలేసుకుని.. అంటకాగిన అధికారుల జాబితాను ఇప్పటికే దగ్గర పెట్టుకున్నారు. ఇలాంటి వారిని నిర్ధాక్షిణ్యంగా బదిలీ చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో కసరత్తు సాగుతోంది. తొలుత ఐఎఎస్, ఐపిఎస్, అధికారులు బదిలీల ఒకటి రెండ్రోజుల్లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెను వెంటనే అన్ని శాఖల ఉద్యోగులు బదిలీ సాధారణంగా నిర్వహించడానికి అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన తహిసీల్దర్లు, ఎంపిడీఓలను నెలాఖరు నాటికి తారుమారు చేయనున్నారు. ఇప్పటికే కొందరు పైరవీలు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు అధికారులు ఎమ్మెల్యేలు చుట్టూ ప్రదక్షిలు చేస్తున్నారు. శుభాకాంక్షలు పేరుతో బదిలీల గురించి ప్రస్తావిస్తున్నారు. కొందరు అప్పుడే లేఖలు సైతం తీసుకుంటున్నట్ల సమాచారం. అధికారుల బదిలీలు ముగిసిన సత్వరమే ఉద్యోగుల సాధారణ బదిలీలకు తెర లేపనున్నారు. జులై 15 వ తేదీ నాటికి బదిలీల వ్యవహారం ముగించేందుకు ప్రభుత్వం సైతం కసరత్తు సాగిస్తోంది. ఆ తర్వాత పూర్తి స్థాయిలో పరిపాలన పై దృష్టి సారించాలని భావిస్తోంది.

## అనుమానాస్పద రీతిలో వివాహిత ఆత్మహత్య



తవణంపల్లె, జూన్ 18 ప్రభాతవార్త: అనుమానాస్పదరీతిలో వివాహిత మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటనకు సంభంధించి స్థానిక పోలీసులకు కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండల కేంద్రం తవణంపల్లెకు చెందిన ఎ.అరుణ్‌కుమార్, ఎగువ అరుందతివాడకు చెందిన ఎం.మౌనికలు గత రెండేళ్ళ క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి లీక్షిత అనే కుమార్తె వుంది. ఈనేపథ్యంలో మౌనిక సోమవారం సాయంత్రం సుమారు 6 గ ంటలకు అనుమానాస్పదరీతిలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎల్లమ్మ దేవతకు పొంగళ్ళు

పాకాల, జూన్ 18 ప్రభాతవార్త: నారా చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర ప్రదేశ్‌కు రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్లమెంట్ రైతు కమిటీ వైస్ ప్రెసిడెంట్ వేదగిరి చిన్నబ్బ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ దేవతకు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. 25 సంవత్సరాల తరువాత చంద్రగిరి చరిత్రను తీరగారాశి చంద్రగిరి కోటపై తెలుగుదేశం జెండా రెపరెపలాడించిన నాయకులు పులివర్తి వెంకట మునిప్రసాద్ ఎమ్మెల్యేగా గెలిచి నందుకు పాకాల మండలం దామలచెరువు గ్రామం మల్లప్ప గారి పల్లి వాస్తవ్యులు కలిసి ఎల్లమ్మ దేవతకు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



## భక్తి శ్రద్ధలతో రామలక్ష్మణ ద్వాదశి



సదుం, జూన్ 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని పలు దేవాలయాలలో మంగళవారం రామలక్ష్మణ ద్వాదశి ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కలకటవారిపల్లెలోని కోదండరామా లయంలో సీతారామ లక్ష్మణులకు అభిషేకం నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. అదేవిధంగా బూరగమందలోని శ్రీవెంకటేశ్వం స్వామి వారి ఆలయం, కొత్తపల్లెలోని వెంకటేశ్వరుని పాదాలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. గార్గేయనది ఒడ్డున ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యాస్వామి వారి ఆలయంలో ఉదయం విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లకు విశేష అలకంరణ చేశారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. అర్చకులు వెంకటరమణ శర్మ మాట్లాడుతూ ఈరోజు రామలక్ష్మణులను పూజిస్తే రామానుగ్రహం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు కృష్ణారెడ్డి, మేస్త్రీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌కు రూ. పది లక్షలు విరాళం



తిరుపతి హెల్త్, జూన్ 18, ప్రభాతవవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి జార్ఖండ్ రాష్ట్రం, జంషెడ్ పూర్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారు రూ. పది లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వి కుమార్‌కు అందజేసారు. సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారి తరపున తిరుపతికి చెందిన పై కంపెనీ ప్రతినిధి వై. రాఘవేంద్ర మాట్లాడుతూ స్విమ్స్ పేద ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలకు గాను రూ. 10 లక్షల రూపాయిలు విరాళం ఇచ్చానని తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్ దాత అయిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారికి, కంపెనీ ప్రతినిధి వై. రాఘవేంద్రకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సింహవాహనంపై విహరించిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 18 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరుకు చెందిన వేపంజేరి తులసిరామిరెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన హంసవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర ్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు

**-నాశిరక పనులకు నిదర్శనమంటున్న గ్రామస్తులు**



చౌడేపల్లి, జూన్ 18 ప్రభాతవార్త : ప్రధాన రోడ్డుకున్న విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా వున్నాయి. అర్ధరహితంగా చేసిన పనుల వల్లే కూలేందుకు సిద్ధంగా వున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారి కథనం మేరకు... చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారిలో చౌడేపల్లి నుంచి దుర్గసముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 11-33కెవి లైన్లతో కూడిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చారాలలో ఓ విద్యుత్ స్తంభం రోడ్డుపైకి కూలే స్థితిలో వుంది. గుర్తించిన ట్రాన్స్‌కో అధికారులు అప్రమత్తమై విద్యుత్ స్తంభాన్ని యధాస్థితిలోకి తెచ్చారు. అయితే రోడ్డు వైపుకున్న పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదపుటంచుల్లో వున్నాయని గ్రామస్తులన్నారు. వ్యవసాయ బావి, ఇళ్ళకు అతి సమీపంలో విద్యుత్ స్తంభాలను నాటారనీ వర్షాకాలం కావడంతో ఎప్పుడు కూలుతాయోనని వారు భయాందోళన వ్యక్త చేస్తున్నారు. స్తంభాలను అమర్చే ప్రక్రియ నాశిరకంగా పనులు చేయడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని వారు ఆరోపిస్తున్నారు. నిత్యం వాహనాలు, ప్రజలు సంచరించే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ప్రమాద స్థితిలో వున్నాయనీ, సంబంధిత అధికారులు ఆయా స్తంభాలను సక్రమంగా అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎండ వేడినుండి ఉపశమనం



తిరుమల, జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి: వేసవి కాలంముగిసిపోయినా... వాతావరణంలో మార్పులతో సూర్యుడు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండటంతో భక్తులకు ఎండవేడి నుంచి ఉపశమనానికి టిటిడి మళ్ళీ చర్యలు చేపట్టింది. ఆలయం ముందుభాగం, పరిసరాల్లో ,ఆలయ మాఢవీధుల్లో తెల్లని కూల్‌పెయింట్ వేయిస్తున్నారు.

## పానగల్ జాతర సన్నాహాలు...మిన్నుమిట్టుతున్న సంబరాలు



శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో అంతర్భాగమైన పానగల్‌లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి, ఆదివారం రాత్రి చాటింపుతో జాతర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి పానగల్ పట్టణ మంతా దీపాల కాంతితో తోరణాలతో ముస్తాబు చేశారు. పట్టణంలోని స్వర్ణముఖి వద్దు నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ వరకు విద్యుత్ తోరణాలతో కన్నులు మిరుమిట్లు కొల్పొనట్లు తీర్చిదిద్దారు. సుమారు మూడు కిలోమీటర్లమేరకు విద్యుత్ తోరణాలతో అలంకరించారు. మధ్యమధ్యలో పెద్ద పెద్ద అమ్మవారి విద్యుత్ ఆర్చిలను ఏర్పాటు చేశారు. జాతరను ఈ ఏడాది కొత్తగా కమిటి ఎన్నుకున్నారు. యువకుల సారధ్యంలో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిం చుటకు నిర్ణయించారు. ఈ మేరకు వారం రోజులుగా యువకులు సన్నాహాలు చేసారు. కొత్త కమిటి పర్యవేక్షణలో జాతరను నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు, పారిశుధ్యం నిర్వహణకు మున్సిపాలిటి అధికారులు పరుగులు తీస్తున్నారు. యువ కమిటి సారధ్యంలో నిర్వహించిన జాతరకు ఓ ప్రత్యేకత కల్పించాలని భావించారు. మంగళవారం ఉదయం పొన్నాలమ్మ ఆలయం వద్ద పొంగళ్ళు నిర్వహించుటకు ఏర్పాట్లను యువ కమిటితో పాటు ఆలయ నిర్వాహకులు పుదూరు లక్ష్మణరెడ్డి పర్యవేక్షించారు. అలాగే పానగల్ గంగమ్మకు నైవేద్యాలు సమర్పించనున్నారు. ఈ ఏడాది జాతరలో ఎలాంటి విఘ్నాలు, అవాంతరాలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలుగా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర వలే పానగల్ జాతర నిర్వహణ చేయటం ఇక్కడ ప్రత్యేకత. జాతర నిర్వహణను అధ్యక్షుడు గుణశేఖర్, గౌరవాధ్యక్షులు యువకుడు సత్రవాడ ప్రవీణ్, గౌరవ సలహాదారు ప్రకాష్‌నాయుడు, భాస్కర్‌గౌడ్, వైస్‌ఛైర్మెన్ జయకృష్ణయాదవ్, కోశాధికారి మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలమురుగన్, కార్యదర్శి మునిశేఖర్ గౌడ్, మునిసుబ్రమణ్యం, రూపేష్ కుమార్, కమిటి సభ్యుల సారధ్యంలో నిర్వహించనున్నారు.